కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.41, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చికాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 15, క్యారెట్ 43, దొండ 45, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 25, మొరంగడ్డ 35, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అమీర్‌పేటలో పర్యటించిన హైడ్రా కమిషనర్

అమీర్‌పేట: హైడ్రా కమీషనర్ రంగనాథ్ అమీర్‌పేటలో పర్యటించారు. సోమవారం కురిసిన భారీ వర్షం కారణంగా అమీర్‌పేట మైత్రివనమ్ వద్ద వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించడంతో పాటు ద్విచక్ర వాహనాలు మునిగి పోయాయి. ఈ నేపథ్యంలో కమీషనర్ రంగనాథ్ మంగళవారం అమీర్‌పేట మెట్రో స్టేషన్ పరిసరాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. స్థానికులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు.మైత్రివనమ్ భవనం కింద సెల్లార్‌లో కూడా పెద్ద ఎత్తున వరదనీరు చేరిందని స్థానిక వ్యాపారులు కమీషనర్‌కు వివరించారు.

అమ్మవారికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు



అమీర్‌పేట: సీతాఫల్ మండి కార్పోరేటర్ సామల హేమ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రత్యేక పూజలుచేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ ఆశీర్వచనాలు అందజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మాజీ ధర్మకర్త హనుమంత్‌రావు, బీఆర్ఎస్ నాయకులు వనం శ్రీనివాస్,ఎర్రోళ్ల నరేష్ ఉన్నారు.

విద్యార్థులకు సంగీత సాధన పరికరాలు అందజేత



చిలకలగూడ: ఎనేబ్లింగ్ లీడర్‌షిప్ క్రియేట్ సంస్థ ఆధ్వర్యంలో చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంగీత సాధన పరికరాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. మారేడుపల్లి మండల విద్య ఉప పర్యవేక్షణాధికారి మదన్ మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతు నిరంతర సాధన చేస్తు సంగీతంలో ఉన్న తశిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర, జాతీయ సంగీత పోటీలకు అర్హత సాధించాలన్నారు. నగరంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంగీత సాధన సామాగ్రి తోపాటు ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ ఇస్తున్నట్లు ఎనేబ్లింగ్ లీడర్‌షిప్ క్రియేట్ సంస్థ ప్రతినిధులు బొన్కే పృథ్వీలాల్, పాల్‌ప్రదీప్, ధనుష్‌రామ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యస్థాపన కోసం పోరాడుదాం

లాలాపేట: తెలంగాణలో అంబేడ్కర్ రాజ్య స్థాపనకుబహుజనులంతా ఏకం కావాలని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(భీమ్‌రావ్ అంబేద్కర్) పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈ నెల 17న ప్రమాణస్వీకారోత్సవం చేయనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆర్‌పిఐ(బిఏ) జాతీయ అధ్యక్షులు డాక్టర్ భీమ్‌రావ్ యశ్వంత్ అంబేద్కర్ హాజరవుతారన్నారు.

అకారణంగా మహిళపై దాడి

వెంగళరావునగర్: మహిళపై అకారణంగా దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్‌కాలనీలో నివసించే జి.గీతిక ప్రైవేట్ జాబ్ చేస్తోంది. ఈ నెల 4వ తేదీన తన ఇంట్లో భోజనం చేస్తుండగా పక్క గృహంలో ఉంటున్న వసంతి చెత్త బుట్టను తీసుకువచ్చి గీతిక ఇంటి ముందు పెట్టింది. దానిని తొలగించాలని గీతిక అడగ్గా అకారణంగా వసంతి, ఆమె భర్త ఫణీంద్ర ఆమెపై దుర్భాషలాడుతూ తీవ్రంగా కొట్టారు. తన రెండేళ్ల కుమారుడి ముందు కొట్టడంతో బాబు భయపడ్డాడు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

పార్కింగ్ పరేషాన్

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద తీవ్రమైన పార్కింగ్ సమస్య

- ఆగిన మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు



అర్థంతరంగా నిలిచి పోయిన భవన నిర్మాణ పనులు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తులకు వాహన పార్కింగ్ సమస్యలు ఇప్పట్లో తగ్గేలా లేవు.మల్టీ లెవల్ పార్కింగ్ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో సమస్య మరింత జటిలమైంది. భవనం అందుబాటులోకి వస్తే పార్కింగ్ సమస్య తీరుతుందని అందరూ భావించారు.పనులు అర్ధాంతరంగా నిలిచి పోవడంతో వాహన పార్కింగ్ సమస్య తిరిగి మొదటికి వచ్చింది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలుపుతున్న కారణంగా ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఆలయానికి ఆదాయం పెరిగినా భక్తులకు వసతులు కల్పించడంతో అధికారులు విఫలమవుతున్నారని భక్తులు విమర్శిస్తున్నారు.

రూ.10 కోట్లకు పెరిగిన నిర్మాణ వ్యయం

దేవస్థానం వద్ద వాహనాల పార్కింగ్ ప్రధాన సమస్యగా ఉంది. భక్తుల వాహనాలు నిలుపుకునేందుకు వీలుగా బోనాల కాంప్లెక్స్ పక్కనే ఉన్న 1165 గజాల స్థలంలో మల్టీ లెవల్ పార్కింగ్ భవన నిర్మాణానికి 2017లో మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ రూ.3.50 కోట్ల నిధులను కేటాయించి కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.సెల్లార్, గ్రౌండ్ ప్లస్ మూడు అంతస్తుల భవనంలో 120 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు,50 ఆటోలు నిలిపేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించారు. గ్రౌంగ్ ,మొదటి అంతస్తులో షాపింగ్ కాంప్లెక్స్,డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేసి వీటి ద్వారా వచ్చే అద్దె డబ్బును భవన నిర్వహణ కోసం వెచ్చించాలని నిర్ణయించారు.కాగా పనులు ప్రారంభించి దాదాపు ఏడేళ్లకు పైగా అవుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఆలస్యమైన కొద్దీ నిర్మాణ వ్యయం పెరిగిపోయి ప్రస్తుతం రూ.10 కోట్లు కేటాయిస్తే గాని కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. అయిన కాడికి పనులు పూర్తి చేసి 80 శాతం బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్ ఇక పనులు చేయడం తన వల్ల కాదని ఇంకా రావాల్సిన డబ్బు చెల్లించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు.సెల్లార్ పనులు సైతం అసంపూర్తిగా ఉన్నాయని, వర్షాల కారణగా స్టీలు తడిసి పాడైపోయిందని స్థానికులు వాపోతున్నారు. దర్శనం కంటే వాహనాలు నిలిపేందుకు స్థలాన్ని వెతుక్కోవడానికే ఎక్కువ సమయం పడుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారులకు సహకారమందిస్తా : తలసాని



క్రీడాకారులను అభినందిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: క్రీడాకారులు, క్రీడలకు తన ప్రోత్సాహం, సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బల్కంపేటలోని శ్రీవీర హనుమాన్ వ్యాయామశాలలో శిక్షణ పొందిన అనిష్ (గోల్డ్), సోను (సిల్వర్), సందీప్‌యాదవ్ (బ్రాంజ్)లు రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చాటి మెడల్స్ సాధించారు. మంగళవారం వారు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు అందుకున్న మెడల్స్, సర్టిఫికెట్లను ఎమ్మెల్యేకు చూపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, బీఆర్ఎస్ నాయకులు హనుమంతరావు, అశోక్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ్మా పాల్గొన్నారు.

బోనాలకు ముస్తాబైన దేవాలయాలు



ఉప్పలమ్మ దేవాలయం,



నల్లపోచమ్మ, ముత్యాలమ్మ దేవాలయాలు

బన్సీలాల్‌పేట్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన అమ్మవారి బోనాల వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 10,11 తేదీల్లో బోనాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం బోనాల వేడుకలు, సోమవారం గావు, రంగం కార్యక్రమం జరగనున్నాయి. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, బండమైసమ్మనగర్, సీసీ నగర్, ఐడిహెచ్ కాలనీ, గొల్లకొమురయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో అధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వేలాది కుటుంబాలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే అమ్మవారి బోనాల వేడుకల కోసం బోయిగూడ నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ, బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ, చాచానెహ్రూ నగర్‌లోని నల్ల పోచమ్మ, బోయిగూడలోని ఉప్పలమ్మ, ఐడిహెచ్ కాలనీ, గాంధీనగర్, న్యూబోయిగూడ, గొల్లకొమురయ్య కాలనీలోని అమ్మవారి దేవాలయాలు అందంగా రూపుదిద్దుకున్నాయి. బోనాలు సమర్పించడానికి వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వెంకయ్య, బల్‌రామ్, రవికుమార్, వై. సురేష్, ప్రభాకర్, రమేష్‌లు విలేకరులకు చెప్పారు. ఆలయ పరిసరాలను విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ హాజరుకానున్నారు. వేడుకల సందర్భంగా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు గాంధీనగర్ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తెలిపారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

వెంగళరావునగర్: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఏడుగురిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లోని ఓ గృహంలో పేకాట ఆడుతున్నట్లు మధురానగర్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఎస్ఐ శివశంకర్ తన సిబ్బందితో రహమత్‌నగర్‌లోని పేకాట ఆడుతున్న ఇంటిని చుట్టుముట్టి చెక్ చేశారు. ఇంట్లో పలువురు 3 కార్డుల పేకాట ఆడుతున్నారు. పోలీసులు పేకాట ఆడుతున్న కాకుమాను శ్రీనివాసరావు, కలగట్ల శ్రీనివాస్, ఏ.రవికాంత్, ఏ.చిన్నపెద్దయ్య, బోయ వెంకట్, పాలగుడి శ్రీనివాసులు నాయుడును అదుపులోనికి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి పేకాట సెట్, ఏడు సెల్‌ఫోన్లు, దాదాపు రూ.18 వేలు నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

సైకాలజిస్ట్ బలవన్మరణం

- భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య
- కౌన్సెలింగ్ ఇస్తూ అతనితోనే ప్రేమలో పడ్డ సైకాలజిస్ట్
- వివాహం అనంతరం తీవ్రమైన భర్త వేధింపులు
- తట్టుకోలేక బాత్‌రూమ్ కిటికీలోంచి దూకేసింది



రజిత (ఫైల్)



భర్త రోహిత్

అమీర్‌పేట: తన వద్దకు కౌన్సెలింగ్‌కు వచ్చే వ్యక్తితోనే ఆ సైకాలజిస్ట్ ప్రేమలో పడింది. తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంది. వివాహమైన ఐదేళ్ల తరువాత భర్త వేధింపులు భరించలేక సైకాలజిస్ట్ సూసైడ్ చేసుకుంది. ఈ ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు..పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసే నర్సింహగౌడ్ సనత్‌నగర్ జెక్ కాలనీలోని ఆర్ఆర్ హిల్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. ఇతని కూతురు రజిత (33) ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో చదువుకునే పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తోంది. ఆశా ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న సమయంలో కౌన్సిలింగ్ కోసం వచ్చే కేపీహెచ్‌బీ భాగ్యనగర్‌కాలనీకి చెందిన ఆగు రోహిత్‌తో పరిచయం ఏర్పడింది. రోహిత్‌కు రజిత కౌన్సిలింగ్ కూడా ఇచ్చేది. ఆమె చెబితేనే మాత్రలు వేసుకునే వాడు.దీంతో ఇరువురి మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మించాడు. ఇదే విషయాన్ని రజిత తల్లిదండ్రులకు చెప్పి పెళ్లికి ఒప్పించింది. ఈ క్రమంలో వీరికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. అయితే పని చేయకుండా తిరిగే రోహిత్ జల్సాలకు అలవాటు పడ్డాడు. రజిత జీతం తీసుకుని విచ్చల విడిగా ఖర్చు చేయసాగాడు. రోహిత్ తల్లిదండ్రులు, సోదరుడు మోహిత్ కూడా రజితను వేధించేవారు. తీవ్ర మనస్థాపం చెందిన రజిత గతనెల28న బాత్‌రూమ్ కిటికీలోంచి దూకింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అమీర్‌పేటలోని ప్రైమ్ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషర్రఫ్ అలీ ఫరూకీ



రసూల్‌పురా: వర్షకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నివారణ చర్యలు చేపడుతున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషర్రఫ్ అలీ ఫరూకీ పేర్కొన్నారు. విద్యుత్ అధికారుల బస్తీబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జింఖానా సబ్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా, ఇందిరమ్మనగర్, రాణిభాగ్ ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా సీఎండీ ఫరూఖీ మాట్లాడుతూ విభజన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తలెత్తుతున్న సమస్యలు, పాడైపోయిన విద్యుత్ కండక్టర్లు, పాత విద్యుత్ లైన్ల స్థానంలో కొత్త విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ ఎం. నరసింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ వి. ప్రభాకర్, సికింద్రాబాద్ ఎస్ఈ. ఎల్. గోపయ్య పాల్గొన్నారు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తనకు బాకీ ఉన్న రుణాన్ని వసూలు చేసుకునేందుకు ఇంట్లో అద్దెకు ఉన్న వారిని బలవంతంగా ఖాళీ చేయించిన అంశంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఓ మహిళ ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే సికింద్రాబాద్ సెకండ్‌బజార్‌లో నివాసం ఉండే ఓ వ్యక్తి ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు వద్ద గృహ రుణం తీసుకున్నారు. రుణాన్ని తగిన సమయంలో చెల్లించలేదు. దీంతో ఐడీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు ఇంటి యజమానికి నోటీసులు ఇచ్చి..అద్దెకు ఉండే వాళ్లకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఈ క్రమంలో జూలై 30వ తేదీన బ్యాంకు అధికారులు పోలీసు బలగాలతో అక్కడికి చేరుకున్నారు. వచ్చి రాగానే ఇంటిని సీజ్ చేసి అందులో అద్దెకు ఉన్న వారిపై జులుం ప్రదర్శించారు. 3వ ఫ్లోర్‌లో ఉండే చెన్నమ్మ అనే మహిళకు రెండు నెలల క్రితం మేజర్ సర్జరీ జరిగి విశ్రాంతి తీసుకుంటుంది. అలాగే 75 ఏళ్ల వృద్ధురాలి కాలికి ఫ్రాక్చరై ఇంట్లోనే ఉంటుంది. కానీ బ్యాంకు అధికారులు ఇవన్నీ పట్టించుకోకుండా..బాధితుల గోడు వినకుండా అద్దెకు ఉంటున్న వారిని కట్టు బట్టలతో బయటకు పంపించారు. దీంతో బ్యాంకు అధికారులు తమను ఇబ్బంది పెట్టారని చెన్నమ్మ అనే మహిళ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్.. ముగ్గురికి జైలు

బంజారాహిల్స్: మద్యం తాగి వాహనం నడిపిన ఘటనలో నాంపల్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముగ్గురికి జైలు శిక్ష విధించింది. సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనం నడిపిన 43 మందిని కోర్టులో హాజరుపర్చగా వీరిలో 40 మందికి రూ.3,100 చొప్పున జరిమానా విధించగా, 300లకు పైగా బీఏసీ వచ్చిన టి.గోవర్ధన్‌కు 3 రోజులు, రెండో సారి మద్యం దాగి దొరికిన ఖయ్యుం ఖాన్‌కు 10 రోజుల జైలు, నాల్గవ సారి మద్యం తాగి దొరికిన ముబారక్ హుస్సేన్‌కు 18 రోజుల జైలు శిక్షతో పాటు రూ.7 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

మాస్కులు లేవు... గ్లౌజ్‌లు ఇవ్వరు

- మూడేళ్లుగా పారిశుధ్య కార్మికుల దీనస్థితి
- అనారోగ్యాల బారిన పడుతున్న కార్మికులు



రక్షణ కవచాలు లేకుండానే వీధులను శుభ్రం చేస్తున్న కార్మికులు

బౌద్ధనగర్: ప్రజారోగ్యానికి రక్షణ కవచంగా వుండే పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య భద్రత కరువైంది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ఎండనకా వాననకా అనునిత్యం తపించే వారికి రక్షణ కరువైంది. గత మూడేళ్ళుగా పారిశుధ్య కార్మికులు సౌకర్యాలులేక ఇబ్బందులు పడుతున్నారు. ఈహెచ్ఎస్ నిబంధనల ప్రకారం ప్రతీ కార్మికుడికి రక్షణ కవచాలు అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, నిధుల కొరత అధికంగా ఉండటంతో కార్మికులు వ్యాధుల బారిన పడాల్సి వస్తుంది. స్వచ్ఛ్ బారత్ మిషన్ కింద నగరంలో పీపీఈ సరఫరాను పెంచినప్పటికి సమయానికి కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, జాకెట్‌లు, డ్రైనేజీ మాన్‌హోల్‌ల క్లీనింగ్ సమయాలలో వినియోగించే షూలు, జాకెట్‌లు వంటివి లేకపోవడంతో కార్మికులు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికంగా శ్వాసకోశ, ఉదర సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. చెత్త ఎత్తే సమయాలలో సిరంజీలు ఇతరత్రా ప్రమాదకర వస్తువుల కారణంగా ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతున్నారు. దీనికి తోడు అధిక శాతం చర్మ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. వీరి కోసం ఉన్నతాధికారులు ఆరోగ్య బీమా పథకాలను అమలు చేస్తూ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కాని అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కార్మికులు ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కార్మికుల ఆరోగ్య బద్రత విషయంలో సత్వర చర్యలు చేపట్టాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



పారిశుధ్య కార్మికులకు రక్షణ సామాగ్రి అందించేందుకు ఉన్నతాధికారులు చొరవ చూపాలి. బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో సుమారు 120మంది కార్మికులు పని చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిననాటినుండి రక్షణ సామాగ్రి ఇవ్వలేదు. తాము ఒత్తిడి చేయడంతో ఇటీవలే కొంతమందికి మాస్కులు, గ్లౌజ్‌లు వంటి సామాగ్రి అందించారు. కాని మహిళా కార్మికులకు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి రక్షణ సామాగ్రి అందించక పోవడం శోచనీయం. – కార్పోరేటర్ కంది శైలజ

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



ఆలుగడ్డబావి వద్ద వాహనాల తనిఖీలు పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్

సికింద్రాబాద్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా, ఇతరులకు ఇబ్బంది కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవని సిటీ ట్రాఫిక్ డీసీపీ–2 ఎన్ శ్రీనివాస్ హెచ్చరించారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలుగడ్డబావి ప్రధాన రహదారిలో మంగళవారం ఏసీపీ ఏ.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్ నేతృత్వంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాహనాల తనిఖీని డీసీపీ ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడిపించడం, వాహనాలకు సైరన్లు బిగించడం, ఎక్కువ శబ్దాన్ని ఇచ్చే సైలెన్సర్లు, మల్టీటోన్ హారన్లు బిగించడం వంటి విషయాల్లో ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు షేక్ బషీర్‌అహ్మద్, వై లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పేరిట మోసం



బీజేపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మేకల సారంగపాణి

సికింద్రాబాద్: ఒకవైపు బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మరోవైపు రిజర్వేషన్ల పేరిట మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. మంగళవారం మధురానగర్‌లోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ నిజంగా బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ప్రభుత్వ పదవులు, అన్ని ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఒకవైపు బీసీలను నమ్మించేందుకు కపట ప్రేమను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు బీజేపీ పట్ల ప్రజలకు తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిన కాంగ్రెస్ అన్ని రకాల ప్రభుత్వ పదవులను అగ్రకులాలకు ఎందుకు కట్టబెట్టిందని ప్రశ్నించారు. సమావేశంలో బీజేపీ నాయకులు కన్నబిరామ్, ప్రకాష్ గౌడ్, అంబాల రాజేశ్వరరావు, వర్మ, హనుమంతు ముదిరాజ్, ఈఎల్ ప్రతాప్ కుమార్, దేవుడు కుమార్, రాజేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యలకు పరిష్కారం



మురుగునీటి ప్రవాహం పరిష్కారానికి నూతన పైపులైన్ ఏర్పాటు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీ రోడ్డులోని మురుగునీటి ప్రవాహం సమస్యలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా నూతన పైపులైన్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. నెలల తరబడి నుంచి గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీహాల్ ముందు రోడ్డుపై మురికినీరు ఏరులైపారుతోంది. ఈ విషయమై సాక్షితో 'మురుగు ముంచెత్తుతున్నా పట్టదా ...? అనే శీర్షికన వార్త ప్రచురితమైయింది. దీంతో అధికార యంత్రాంగం ఎట్టకేలకు దిగి వచ్చింది. జలమండలి జీఎం వినోద్, డీజీఎం ఆశీష్, మేనేజర్ సలీం, శివశంకర్‌లతో పాటు జీహెచ్ఎంసీ డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, ఏఈ చైతన్యలు ఈ ప్రాంతాన్ని సందర్శించి సమస్య తీవ్రతను పరిశీలించారు.తాత్కాలికంగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రోడ్డుపై తవ్వకాలు సాగించి నూతన పైపులైన్ ఏర్పాటు ద్వారా మురికినీటిని రోడ్డుకు అవతల ఉన్న భారీ పైపులైన్‌కు అనుసంధానం చేశారు. దీంతో సమస్యల కొంత వరకు పరిష్కారానికి నోచుకుంటుందని అధికారులు భావించి చర్యలు చేపట్టారు. తర్వాత వరదనీరు, డ్రైనేజీ మురికినీరు వేర్వేరుగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

హమాలిబస్తీలో ఉచిత వైద్య పరీక్షలు



హమాలిబస్తీలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ హమాలిబస్తీ ప్రజల కోసం దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) నేతృత్వంలో మంగళవారం ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. సాధారణ రుగ్మతలకు మందులు ఇవ్వడంతోపాటు గుండె, కాలేయం, మధుమేహం, కిడ్నీ, బీపీ వంటి వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ నాయకురాలు పులి కల్పన మాట్లాడుతూ పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 6న సీతాఫల్‌మండి రామాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆమె చెప్పారు. డీబీఎఫ్ ప్రతినిధులు రమ్య, సుజాత, పరమేశ్వరి, కవిత, జ్యోతి, మానస పాల్గొన్నారు.

రసూల్‌పురాలో..

రసూల్‌పురా: రసూల్‌పురా లోని కేఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ హెల్త్‌కేర్‌లో క్రియా సంఘ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ నయీం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరం ప్రారంభించారు. కార్యక్ర మంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు ఇటుక గోపి, మల్లేష్, యాదగిరి, క్రియా సంఘ సొసైటీ పాల్గొన్నారు.